

# పిడకత్తి

ఇంటి నుంచి బయలుదేరారు వాళ్లిద్దరూ.

కొడుకును తన తండ్రి వెంట పంపడానికి ఎంతమాత్రం ఇష్టం లేకపోయినా తండ్రి బలవంతమ్మీద ఒప్పుకుంది పైడమ్మ. "ఎళ్లొస్తా నమ్మా!" అన్న కొడుకు మొహంలోకి నిస్సహాయంగా చూసింది పైడమ్మ. తాతా, మనుమడూ నడవసాగారు. తాతవెంట తలొంచుకు నడుస్తున్న కొడుకును చూసి కళ్లలో నీళ్లు తిరిగాయి పైడమ్మకు. కాని ఏమీ చేయలేక అచేతనంగా నిలబడి పోయింది.

మల్లిగాడు నడుస్తున్నాడన్న మాటేగాని వాడి ధ్యాస దానిమీద లేదు. చుట్టూవున్న చెట్లు, పొదలు, దూరంగా కనిపిస్తున్న కొండలు —ఇవే మల్లిగాడి గమనానికి రావటంలేదు. ఎంతనడిచినా తరగని దారి. నిర్జనమైన ప్రదేశం.

అప్పటికే వాళ్లు చాలా దూరం వచ్చేశారు.

మౌనంగా నడుస్తున్న తాతను ప్రశ్నించాడు మల్లిగాడు :

"ఇంకా ఎంతదూరం నడవాలి తాతా ? నాకు కాళ్లు నొప్పిచేస్తుండాది."

"శానా దూరం లేదురా. మనం సగానికిపైనే వచ్చేసినాము. ఇంకొంచెం దూరం నడిస్తే వచ్చేస్తుంది వూరు." అన్నాడు ఈరయ్య.

నడిచిన అలసట పోవటానికి కబుర్లు చెప్ప నారంభించాడు ఈరయ్య.

"ఇదిగో ఇప్పుడు మనం వెళ్లే కరణంగారి కుటుంబం శానా మంచిది. ఆళ్లింట్లో వాళ్లందరూ దేవుళ్లాంటి మనుషులు. నువ్వు వుషారుగా అన్నిపనులూ చేసినావంటె శానా ప్రేమగా సూత్తారు, అమ్మమీద బెంగెట్టుకోకు. నేమూ నీ అంతున్నప్పుడే పన్లోకి చేరినాను. నన్ను శానా బాగా సూసేవారు."

తాత చెప్పే మాటలకు 'వూ' కొడుతున్నాడు మల్లిగాడు. కాని ఎంత చెప్పినా వాళ్లింట్లో పని చేయడానికి వాడి కిష్టమేలేదు. వాడి మనసంతా తన వూరివైపే పరుగెత్తుతోంది.

వాళ్లు నడుస్తున్న కాలిబాట ఒక కొండదగ్గర ఆగిపోయింది. అక్కడినుండి కొండను చుట్టుకుని మళ్లీ కాలిబాట చేరాలి. చుట్టూ అడివి. మధ్య కాలిబాట. ఆ కాలిబాటమీద అలాగే సాయంకాలందాకా నడుస్తూనే వున్నారు వాళ్లిద్దరూ. వూరు దగ్గరపడింది. ఈరయ్య కుతూహలంతో చూస్తున్నాడు వూరివైపు.

వాళ్లిద్దరూ కరణంగారి ఇంటిముందు వచ్చి నిలబడ్డారు. అరుగుమీద కూర్చునివున్న పాలేరు "ఎవరు మీరు ?" అనడిగాడు.

"నాది ఈ వూరు కాదు. ఈరిగాడొచ్చి నాడని కరణంగారితో సెప్పు. ఆరితోనే మాటాడాలి." అన్నాడు ఈరయ్య.

వాడు లోపలికెళ్లి చెప్పి వచ్చాడు. కాసేపటికి కరణంగారి కొడుకు బయటికి వచ్చాడు. ఈరయ్యను కాసేపు పరీక్షగా చూసి గుర్తుపట్టి

"ఓహో! ఈరిగాడా ? ఎవరో అనుకున్నాను. చాలా ముసలివాడయిపోయావే ? కులాసాగా వున్నావా? ఈ అబ్బాయెవరు ?" అని ప్రశ్నల వర్షం కురిపించాడాయన.

"ఈడు నా మనమడండి దొరగారూ! మీ ఇంటికాడ పనిసేయటానికి తీసుకొచ్చినాను., తమరు. . ." అంటూ ఆగిపోయాడు ఈరయ్య.

"ఓహో! అలాగా! సరే వుండనీ, అన్నిపనులూ చాతవునా ? ఇంకేమీ చేయకపోయినా పశువులను జాగ్రత్తగా కాపాడాలి. వాటిని మేపుకు రావాలి. నీలాగే నీ మనుమడూ కూడా వున్నన్నాళ్లు వాటి రక్షణగా వుండాలి. సరే, నేనలా వెళ్లొస్తా, కాస్త పనుంది. నువ్వు ఇక్కడే వుండు," అని లోపలి వైపు తిరిగి "అమ్మాయ్ సీతా! మన ఈరిగాడొచ్చాడు. వీళ్లిద్దరికీ భోజనం పెట్టు." అని చెప్పేసి వెళ్లిపోయాడాయన.

అప్పటికే చీకటి పడింది.

గుమ్మం ఇవతల హరికెన్ లాంతరు పెట్టి, ఇద్దరికీ విస్తళ్లువేసి, నీళ్లు చిలకరించి, వేడి వేడిగా అన్నం వడ్డించింది —కరణంగారి మనమ

"ఆదిత్య"

రారు. ఇద్దరూ బాగానే భోంచేశారు. మిగిలిన నాలుగు ముద్దలు అక్కడే నాలిక చాపుకుని కూర్చున్న కుక్కకు పడేశారు. తోకాడిస్తూ కృతజ్ఞత సూచిస్తూ గబగబా మింగేసి మళ్లీ అక్కడే కూర్చుంది కుక్క — ఆ విస్తళ్లనే ఎదురు చూస్తూ.

ఈరయ్య కనికరంతోదాన్ని చూశాడు. తోకను ఒకసారి నేలకుకొట్టి, కళ్ళు పెద్దవి చేసుకొని కృతజ్ఞత సూచించిందా కుక్క — గుప్పెడు మెతుకుల బువ్వకి.

అప్పుడూ ఇలాగే జరిగేది! ఎంతలేదన్నా ముప్ఫై నలభై ఏళ్ల గడిచిపోలేదా తనీ ఊళ్లు వదలి వెళ్లి పోయి? వెళ్లిపోవడ మేమిటి, కరణంగారే ఒక పిల్లను చూసి, పెళ్లిచేసి, "ఎక్కడకైనా వెళ్లి బతుక్కో!" అని పుండకపోయి వుంటె, ఇంకా ఆ తరువాతి రోజులను కూడా ఇక్కడే గడపాల్సి వచ్చేది. ఇదేవిధంగా తిని, ఇదే అరుగుమీద పడు కుని, ఇలాంటివే ఎన్నో కుక్కల వింత జీవితాలను చూడవలసి వచ్చేది.

ఆ తెల్లని కుక్క! దాని చరిత్ర తలచుకుంటె ఇప్పుడు కూడా వళ్లు జలదరిస్తుంది. గుండెలు వణుకుతాయి. అప్పుడింకా తనకు పన్నెండేళ్లుం డొచ్చు... కరణంగారి పశువులకు కాపలాగా, రాత్రిళ్లు ఈ అరుగు మూలలో పడుకోడం అల వాటుగా వుండేది... భోజనంలో భాగస్వామి యైన కుక్క, అంతటితో తృప్తిపడక, రాత్రి పడకలో కూడా ఆశ్రయం కోరి వచ్చేది. ఆ గాఢ నిద్రలో ఎన్నేరోజులు తనకు తెలియనేలేదు. కాని ఆవేళమాత్రం తనకు నిద్రపట్టలేదు... కుంటి ఆవు ఒకటి కనపడక దాని ఆలోచనలోనే వుండగా, కాళ్లమీద భూతంలాగ వచ్చి మీదపడితే ఎవరికి మాత్రం కోపంరాదు? భరించరాని కోపంతో వళ్లు పటపటా కొరుకుతూ ఒక్కసారి జాడించి తన్నేవరకు 'కుంయ్' మంటూ క్రిందికి పురికింది కుక్క... అప్పుడే అర్ధరాత్రి దాటిపోయింది. చీకటితెరను తొలగించి అటు చూడటానికి కూడా భయం... ఏమి జరిగిందో? కుక్క వున్నట్టుండి ఎగిరిపడి తూర్పు కొండలనుద్దేశించి చీకటిరాత్రి గుండెలు పగిలేలా మొరగనారంభించింది... గోనె పట్టాను చుట్టుకుని పడుకున్న తనకు దాని అర్థం తెలిసిపోయింది. వళ్లంతా చెమట పట్టింది. చీకటితో భయంకూడా చేరి పెద్ద జలదరింపులా తనమీద పడింది. క్షణక్షణానికి కుక్క అర్భాటం ఎక్కువయింది. మొరుగుతూ, మొరుగుతూ వెనక్కి వెనక్కి జరగటం కూడా తనకు స్పష్టంగా తెలిసింది. చేతులు, కాళ్లు, మనసు — అన్నీ ముద్దగా చేసుకుని పడుకుని వున్న గుండెల్లో మాత్రం దడదడా కొట్టుకుంటూనే వుంది.... ఎక్కువసేపు పట్టలేదు. కొన్ని నిమిషాలు గడి చాయి... కుక్క ఒక్కసారి 'కుంయ్' మన్న చప్పుడు మాత్రం వినిపించింది. 'గుర్... గుర్... గుర్... శబ్దం.. అంతే! గోనెపట్టాలోనే కరగి నీరయిపోయిన అనుభవం అది... అరవడానికి నోరు రాదు.. పారిపోడానికి కాళ్లు లేవు. ఏను నం... భయంకరమైన మనుసం.

"రాత్రి వూళ్లోకి పులిగిరి వచ్చిందా ఏమిటి? కుక్క పూరికే మొరిగింది కదా!" అని మర్నాడు ఉదయం ఎవరో బయట నిలబడి మాట్లాడు కోవడం తను స్పష్టంగా విన్నాడు.

"పొడుపురి మళ్లీ దాపురించింది... కుక్కను లాక్కెళ్లిపోయింది." అని మరెవరో అనడం కూడా తనకు జ్ఞాపకం.

ఈరయ్య అక్కడే గడపకానుకుని కూర్చు న్నవాడు విలక్షణంగా నవ్వాడు. "కుక్కలు అప్పుడూ వస్తూ వుండేవి, ఇప్పుడూ వస్తూనే వున్నాయి." అనుకున్నాడు మనసులో.

మళ్లిగాడు అరుగుమీది కెక్కాడు. పడుకోవ డానికి పాతచాప ఒకటి యిచ్చారు. రేపటినుంచి అది తనకే మిగులుతుంది. కొత్త మనుష్యులు, కొత్త యిళ్లు, అన్నీ కొత్తవే! రేపటినుంచి కొత్త జీవితం ప్రారంభం... కంటికి కనిపించిన ప్రతి ఇంటినీ, ఎదురుగా వచ్చిన ప్రతి మనిషినీ, కుతూ హలంతో చూశాడు. తనేమో ఇల్లులేని అభా గ్యుడు. ఈ అరుగుమీదే భోజనం, నిద్ర.. తన సమస్తమూనూ! మనసుకు ఒకరకమయిన దిగులు, బెంగ.

"తాత ఒక్కడూ ఎట్లా పడుకునేవాడో యిక్కడ?" అనుకున్నాడు మనసులో.

'వూ... యింకేమిటి? వెళ్లి పడుకో!' అన్నాడు ఈరయ్య.

మళ్లిగాడు పడుకున్నాడు. ఎంతసేపటికీ నిద్ర పట్టలేదు.

"నీ మనుమడికి అన్నిపనులు చాతనవునా? యింకేమి చేయకపోయినా పశువులను జాగ్రత్తగా కాపాడాలి, వాటిని మేపుకు రావాలి..." అన్న కరణంగారి కొడుకు మాటలను జ్ఞాపకానికి తెచ్చు కున్నాడు వాడు.

"ఈయన తండ్రిగారి కాలంలో అంటె ముప్ఫై, నలభై ఏళ్లక్రిందట యిక్కడ వున్నా నంటాడు తాతయ్య. అప్పుడు తనింకా చిన్న పిల్లాడట. ఎవరో తీసుకొచ్చి యిక్కడ అప్పజెప్పి వెళ్లిపోయారట. తల్లి—తండ్రిలేని అనాధుడని కరణంగారు ప్రేమతో చూసేవారట. (ఇరవై, ముప్ఫైఏళ్లు ఆ మారాజు గారింట్లో కడుపుతో నల్ల కదలకుండా గడిపానురా!) అని తాతయ్య ఇప్పుడూ కూడా తలచుకుంటాడు. అప్పుడప్పుడు ఆ రోజులు గురించి గొప్పగా చెప్తాడు. 'ఈక్షణాన పిలిచినా వచ్చి చచ్చేదాకా ఈ ఇంట్లో చాకిరి చేస్తా నం'టాడు. హుషారుగా మాట్లాడతాడు. వింటూంటె చెవులు రెక్కించి, నోట్లో నీరూ రేలా చెప్తాడు. ("నాల్గు దినాలుండి సూడు, నీకే తెలుస్తుంది.") అంటాడు. కాని.. కాని మనసు వెనకడుగు వేస్తోంది. తన వూరు మళ్లీ తిరిగి రమ్మని చేయెత్తి పిలిచినట్లనిపిస్తోంది.... రేపు తాతయ్య వెళ్లిపోతాడు.. మళ్లీ ఎన్నడో చూడ టం?..."

"ఒరేయ్ మళ్లిగా, నిద్రపోయినావా?" ఈరయ్య మనుమణ్ణి పిలిచాడు.

"లేదు తాతా!" అన్నాడు మళ్లిగాడు.

"అరెరే.. ఇంకా నిద్రపోలేదా?" అంటూ లేచివచ్చి ఈరయ్య వూరినుండి తెచ్చిన దుప్పటిని మనవడికి కప్పి, తనూ పక్కనే మేను వాల్చాడు. ఒకసారి ఆవలించి చిటిక వేశాడు.

"ఈ వూరు ఎంత మారిపోయింది? ఎన్నో ఇళ్లు కూలిపోయి నేలమీద విశ్రాంతి తీసుకుంటు న్నాయి. అక్కడొకటి, యిక్కడొకటిగా కొత్త యిళ్లు లేచినా అప్పటికళ ఇప్పుడు లేదు! అప్పటి వైభవం లేదు! ఈ రావిచెట్టు....అప్పుడింకా, ఆకులు నిండి ఎంతగుబురుగా వుండేది! రివమధ్యన కరణంగారి కాలంలో ఈ చెట్టునుంచి ఒక్క ఆకు తెంపుకునే సాహసం వాడు వుండేవాడా ఈ వూళ్లో? ఆయన పోయారు. ఆయన ఆత్మను కలుసుకుందా మని కాబోలు రెండు కొమ్మలు మాత్రం చాలా ఎత్తుగా తలలు చాచి, మొండి చీపురులా నాలుగాకు లను గలగలలాడిస్తున్నాయి. వయస్సు ముదిరి నిట్టూర్పులు విడుస్తున్నాయి."

మనుమడిమీద కుడిచేతిని వేసి వాడ్ని హృదయా నికి హత్తుకుని దుప్పటిని కాలినిండా కప్పుకు న్నాడు ఈరయ్య.

గుగ్గుగూ.. .గుగ్గుగూ...గూ...

వున్నటుండి నిశబ్దంగా వున్నరాత్రి గుండెల్లో బాకు విసిరినట్లు, చెవులను చీల్చిన్న అశబ్దానికి ఈరయ్య గుండెలు వణకసాగాయి. (వూరి మధ్యన రావిచెట్టు నెత్తిమీదనుంచి ఏమిటి ధ్వని?")

రావిచెట్టు 'సుంయ్' మంటూ గాలి విసిరింది. చీకటి విడిచిన నిట్టూర్పులా, భుసలుకొడుతూన్న కొండచిలువలా దగ్గిర దగ్గిరగా వీచసాగింది చలి గాలి. మళ్లిగాడు తాతయ్యకు యింకా దగ్గరగా జరిగాడు.

"రావిచెట్టునుంచి ఆశబ్దం ఏమిటి?—ఇంత భయంకరంగా?" అనుకున్నాడు.

"మళ్లిగా!" ఈరయ్య మనవడిని పిలిచాడు.

"ఆఁ..." వినిపించీ, వినిపించనట్టు జవాబు ముసుగులోంచి.

"అరేరే! యింకా మేలుకునే వున్నావా? ఏందు కురా? నిద్దరరావటంలేదా? చలేస్తోందా?"

"వూఁ!"

"సాల్లేరా...మునూరికన్నా యిక్కడ ఎక్కువ చలా?"

"వూ...లేదా?"

"యిట్టయితే అయిందిలే యింకా!"

మళ్లీ వినిపించింది రావిచెట్టుమీదనుంచి ఆ కూత! దుప్పటితన్నేసి దిగ్గునలేచాడు ఈరయ్య. మళ్లిగాడు దుప్పటిని మరింత భద్రంగా కప్పు కున్నాడు. తాతయ్య అరుగుమీదనుంచి దిగడమూ, రావిచెట్టు ఆకులు గలగల మనడమూ, రెక్కలు టపటపలాడిస్తూ ఏదో పక్షి అక్కడినుండి ఎగిరిపోవడమూ — అన్నీ మళ్లిగాడి చెవులు విన్నాయి.



## "ఎవరి కర్మం వారిది మనమేం చేస్తాం మాలక్ష్మీ"



—శ్రీమతి కృపావతి
(రామారావు ఆర్ట్ సన్మానం)

తాతయ్య పక్కనచ్చి పడుకున్నా మాట్లాడ లేదు, మనవాడు నిద్రపోవాలని!

మల్లిగాడి మనసులో వాడి తల్లి మెదిలింది.

"అమ్మ యింకా మేలుకునే...దీపం పెట్టుకునే కూర్చుంటుందా ? తను అక్కడే వుండి వుంటె ?... అమ్మ కూలీకెళ్ళిపోయి సాయంకాలం యింటికి వచ్చేది. అప్పటిదాకా తను ఎదురు చూస్తూండేవాడుకదా!

అమ్మకసలు తననిక్కడికి పంపించడానికి ఇష్టంలేదు. అమ్మకూ, తాతయ్యకూ మాటలు పెరిగి గొడవ జరిగినప్పుడు నిద్రపోతున్న తనకు మెలకువ వచ్చేసింది. తాతయ్య కోప్పడుతున్నాడు.

"నువ్వు నోరుమూసుకుని వూరికే వుండు... పెద్దగా కొడుకుని పెంచి వుద్ధరించేలా మాట్లాడకు!"

"నా బిడ్డ నాకు భారంకాదు అయ్యా! నా సేతులు కాళ్ళు గట్టిగా వున్నంతవరకు వాడు పరాయింట్లో చాకిరీ సేయడానికి నా మనసొప్పదు."

"కాదు...నేను ముసలాడిని కష్టపడి తెచ్చి పెడ్తాను. తల్లీ—కొడుకూ కూసుని తినండి. పెద్ద యవ్వారం తెలిసినట్టు మాట్లాడకు. వూరికే వుండు...నోరు గట్టిగా మూసుకుని. నే సెప్పేదేటంటె—గొప్పవారిల్లు, మంచివారు, తమ యింటి పిల్లల్ని చూసుకున్నట్టు చూసుకుంటారు,—అని. యిక్కడవుండే బదులు అక్కడవుంటాడు. ఇక మంచి భోజనం, మంచి బట్టలు, పని—ఇవేకదా! యింకేమిటి నీకొడుకు వుద్ధరించేది. నేనుండలేదా! ఇరవై, ముప్పై ఏళ్లు... నన్నేమన్నా సంపేసినారా?

"నువ్వుండేవాడివని, ఆ పసిపిల్లాణ్ణి కూడా వుండమంటావయ్యా ?".

"పసి పిల్లాడేటి? నేను వాడంత వున్నప్పుడే ఆయిల్లు చేరినాను. వీళ్లంతా చాతకానివాళ్లు... నీమొగుడుకూడా అంతే!' ఆడు కష్టపడి పని సేసుంటే ఆరోగం ఎందుకొచ్చేది? అంతా ఎవరికివాళ్లు సెప్పుకునేదే...!"

"అయ్యో.... ఆయనుండింటే..... ఎట్టాగో తన పెళ్లాం పిల్లలు బరువు కాదు వూరుకోవయ్యా!"

అమ్మకళ్ళల్లో నీళ్ళు పొంగి వచ్చి వుంటుంది. వెక్కివెక్కి ఏడవటవయితే స్పష్టంగా వినిపిస్తానే వుంది. గూట్లో దీపం వెలుగుతూనే వుంది. తాతయ్య నసుగుతూనే వున్నాడు.

"నాయిద్దరు కొడుకుల్ని తీసుకెళ్ళి జీతానికుంచి రాలే? ఎవరి పొట్ట వాళ్ళు పోసుకోవటంలే? వీడికేమిటి తక్కువయింది?"

"అదే మరి.....నీకొడుకుల్లా వాళ్ళు పాలేళ్ళై పుట్టినారు. మనింటి ముందు కూలో నాలో చేసుకుని బతికితె కాదేమో? యింకొకరి జీతగాడిలా బతకడం దేనికి? నాతల్లి చచ్చేటప్పుడు ఆఖరి దాకా సెప్పి సచ్చింది— "పరాయింట్లో జీతగాళ్ళుగా సేయకండి పిల్లల్ని. మనింట్లో గంజి తాగినా అలాంటి జీవితం వద్దు" అని— నువ్వే అనుభవించి వచ్చినావు కదా? ఆఖరి దాకా అరుగుమీద పడివుండి సలనక, వాననక యిదయి వుబ్బసం వచ్చి బాధపడ్డావు కదా?

తాతయ్య అంతటితో వూరికే వుండలేదు. గులుక్కుంటూ లేచి బయటికి వెళ్ళాడు.

రెండు రోజులు గడచి పోయాయి. తాతయ్య బలవంతం ఎక్కువయి యిష్టంలేని మనసుతో అమ్మ ఒప్పుకుని తనను పంపేటప్పుడు తలుపు దగ్గర తనను కౌగలించుకుని 'గొల్లు' మని ఏడ్చినా తాత మనసు కరిగిందా?

తరువాయి 48వ పేజీలో

**24వ పేజీ తరువాయి**

''పూరుకో—వూరుకో.... ఎల్లేటప్పుడు అట్టా ఏడవకూడదు''—అని తన చెయ్యి పట్టుకుని లాక్కొచ్చేశాడు.

కొండదోవల్లో చుట్టూ తిరిగి సాయంత్రం దాకా నడిచి నడిచి...దూరం... చాలా దూరం వచ్చేశాము. మళ్ళీ తనవూరు ఎప్పుడు వెళ్లేదో?

—ఒక దోమ వచ్చి మోకాలిని ముద్దుపెట్టుకుంది ఎట్టాగోపిలుచేసుకుని కరకరా గోక్కున్నాడు మల్లిగాడు.

''ఛ! పాడు దోమలు...'' అంటూ ఈరయ్య దుప్పటి సర్ది కప్పాడు.

మల్లిగాడు యిటు తిరిగి ''తాతా!'' అన్నాడు.

''సరే రాత్రంతా యిట్టాగే గడిపేటట్టున్నావు....''

''మనవూరు యీడికి ఎంత దూరముంటుంది?

''ఎందుకు? బుద్ధిపుడితే పారిపోదామనా?''

''కాదు —రికే అడిగాను.''

''చాలా దుశ్శారంరా! నువ్వే చూసినావుగా ! అదీగాక ఒంటరిగా తిరిగే దోవకాదది.చుట్టూరా అడివి........''

''మరి రేపు నువ్వొక్కడివే పోతావుగా ?''

''నేనొక్కణ్ణేనంటావా! నేనుముసిలోణ్ణి కాబట్టి పోవచ్చు....''

''తాతా! మనం ఎప్పుడూ యింట్లోకి పోగూడదా?''

''పోవచ్చుగా! మనింట్లోకి ఎప్పుడు కావాలన్నా పోవచ్చు...''

''అదికాదు పిల్లింట్లోకి?''

''లేదు లేదు...అది మాత్రం వీలుపడదు.... దేముడు —రికేవుంటాడా? రెండుకళ్ళూపోతాయి''

''వాళ్లే పిలిత్తే?

''వాళ్ల పిలిచినా పోగూడదు.''

''.......... . . . . . . . ''

''.... . . . . . . . .''

''అరుగుమీద నువ్వొక్కడివే పడుకునేవాడివా తాతా?''

''కాకపోతే మెడకొక రాయిని కట్టుకునేవాణ్ణనుకున్నావా?''

''నీకు కొంచెం కూడా భయం వేసేది కాదా?''

''ఇక్కడేనిట్రా భయం? గుళ్లో దేవుడున్నాడు. రాత్రంతా కర్ర పట్టుకుని వోరంతా తిరుగుతుంటాడు. పడుకో....పడుకో....తెల్లార గట్లే నేను లేసి వూరికి పోవాలి.''

మల్లిగాడి మాటంటకు బ్రేక్ పడింది.

ఈరయ్య ఎప్పుడు కళ్లు మూశాడో ఏమో! ఎప్పుడు నిద్రపోయాడో...కలత నిద్ర.

గజిబిజిగా కలలు! తను వచ్చిన దారిలో ఒక పెద్ద బండరాయి వుంటుంది. దాని ప్రక్కన పశువులను మేపుతున్నాడు మల్లిగాడు. ఎక్కడినుంచి వచ్చిందో ఒక పెద్దపులి ఆ బండరాయి చుట్టు తిరిగి వచ్చి ఒక ఆవు మీద పడింది. చెట్టుమీద ఆకులను కోస్తున్న ఈరయ్య తన చేతిలోవున్న కత్తిని పులిమీద విసిరాడు. గురి తప్పకుండా పులి కడుపులో గుచ్చుకుంది కత్తి. దెబ్బతిన్నపులి కోపంతో అటూ ఇటూ తిరుగుతూ ఘర్జించింది. మల్లిగాడు భయంతో వణికిపోతూ ఈరయ్యవైపుకు పరుగెత్తుకుని వస్తున్నాడు. పులివాడిమీదికి దూకింది. హా! హా!! కొమ్మల్ని పట్టుకున్న చెయ్యి పట్టు విప్పి డొప్పున క్రిందికి పడ్డాడు ఈరయ్య.

భయంకరమైన కలలునుండి మేలుకునేసరికి అప్పుడే తొలికోడి కూసింది. రావిచెట్టు నెత్తిమీద అస్తమించుతున్న చంద్రకిరణాలు పడి ఆకులు వెండి ఆకుల్లా తళతళా మెరిసిపోతున్నాయి. నేలమీద మంచుకురిసి ప్రకృతి మసకగా వుంది. పక్కింట్లో యిల్లాలు లేచి అప్పుడేతిరగలి వేసుక్కూచునట్టుంది. ఏమిటో పాడుతోంది.... ధ్వని అస్పష్టం.....సుమధురమైన రాగం మాత్రం తిరగలి చేసే గరగర చప్పుడుతో కలిసి వినిపిస్తోంది.

''ఈ పాటికి తన కూతురు కూడా లేచి వుంటుందేమో!కాని ఇవేళ తిరగలి ముందు కూర్చుని పాడదేమో!

ఎంత హాయిగా సంతోషంతో పాడేది రోజూ! వినడానికి ఎంత మధురంగా వుండేది! ఇక పాడదు. ఎప్పటికీ పాడదు!...

ఆమె హృదయంలో నిండిన ప్రేమే పాటల ద్వారా వెలువడేది! తన బిడ్డను, ముద్దుల కొడుకును తల్చుకుని మళ్లీమళ్లీ పాడుతూవుంటేకళ్లల్లో బాష్పాలు రాలేవి కదా!

తనెందుకు ఆమె ఇష్టానికి విరుద్ధంగా నడచుకున్నాడు?

ఈ ముసలితనంలో ఎందుకీ పట్టుదల?

''పరాయివాళ్లింట్లోచాకిరీకేయకుండిపిల్లట్ని''

ఈరయ్య వులిక్కిపడ్డాడు!

తనయ్యాడు! తన కొడుకులయ్యారు !!మన మడుకూడా..... తరతరాలకూ ఎటువంటి మబ్బు ఆవరించింది? బ్రతుకు పుస్తకానికి ఎలాంటి విష క్రిములు పట్టాయి?

ఈ అరుగుమీద, ఈ చలిలో,ఈ భయంకరమైన రాత్రుల్లో మల్లిగాణ్ణి ఒంటరిగా పడుకోపెట్టి, తను యింట్లో వెచ్చగా పడుకునే పాపపు ఆలోచన తన కెందుకొచ్చింది? కుక్కలు మొరుగుతుంటాయి... పులి తిరుగుతూ వుంటుంది...... రావిచెట్టు భయంకరంగా భూతంలా నిలబడుంటుంది... గుడ్లగూబ భయంకరంగా అరుస్తుంటుంది......

మల్లిగాడు''అమ్మా!'' అని లేచి కూర్చుంటే, లేచి కూర్చుంటే! చిమ్మని చీకటి, పాడుబడిన ఇళ్ల వికార రూపం.... భయంకర నిశ్శబ్దం...పీడ కలలు.... భీషణ రాత్రులు..... అబ్బా! ఈ అరుగుమీద తనెలా గడిపాడు ఆరోజుల్ని!? ఆ రాత్రుల్ని?!

''ఒరేయ్ మల్లిగా, లేరా తెల్లారింది పోదాం..'' అని ఈరయ్య మనమణ్ణి తట్టి లేపాడు.

దుప్పటి కప్పుకుని ముందుకు నడిచాడు ఈరయ్య.

తాత వెనకాలే మల్లిగాడు తువాలు తలకు చుట్టుకుని, మంచుకురిసి చల్లగావున్న నేలమీద నడవసాగాడు,—''ఎందుకు? ఏమిటి?'' అని అడుక్కుండానే...

కొండలు గుట్టలమీద మబ్బులు సూర్యుడు రావడంతోటే లోయల్లోకి జారుకుంటూవుంటే, దారిలో మంచుబిందువులు ముత్యాల్లా మెరిసిపోతున్నాయి. ★

